

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

## అన్ని పీఎస్‌ల వద్ద చలివేంద్రాలు

● బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో అన్ని పోలీస్‌స్టేషన్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛ వేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం డీసీపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాలానగర్ జోన్‌లోని అన్ని పీఎస్‌ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని నీరు అందిస్తున్నామని అన్నారు. చల్లనినీటితో పాటు మజ్జిగ కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాసరావు, ఎస్‌హెచ్‌వో రాజేశ్, ఎస్‌ఐలు, స్వచ్ఛ వేద ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



శ్మశానవాటిక అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

## ఎమ్మెల్యే కృషితోనే నిధుల మంజూరు

● బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషితోనే నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. ఫిరోజ్‌గూడా శ్మశానవాటికలో సుందరీకరణ పనులు, మౌలిక వసతుల కల్పనకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఏఈ దార కవిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు సీనియర్ నాయకుడు మందడి సుధాకర్‌రెడ్డి, ఎడ్ల ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, రవీందర్ జాక్, ఎడ్ల సదానంద్, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.



ఏఈఈ సాయిని సత్కరిస్తున్న రమ్యాగ్రౌండ్ మిత్రబృందం సభ్యులు

## ఏఈఈ గాదె సాయిప్రసాద్‌కు సత్కారం

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ డివిజన్ ఏఈఈ గాదె సాయిప్రసాద్ హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యారు. కేపీహెచ్‌బీ వార్డు కార్యాలయంలో రమ్యాగ్రౌండ్ మిత్రబృందం సభ్యులు గురువారం ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఏడు సంవత్సరాలుగా కేపీహెచ్‌బీ ప్రాంతంలో ఇంజనీరింగ్ పనులను చేసి ప్రజల మెప్పు పొందారని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాగే పని చేసి ప్రజల మెప్పు పొందాలని అన్నారు. కార్యక్రమంలో కట్టా నరసింగరావు, యంపరాల సాంబశివరావు, రావెళ్ల హరిబాబు, కొల్లా శంకర్, మోర్ల రామకృష్ణ, యలమంచిలి వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, బండారుపల్లి శ్రీనివాసరావు, వడ్లమూడి శ్రీనివాసరావు, బండారుపల్లి మురళి, రవి, బొల్లినేని వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.అలివేలు మంగమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు తెలంగాణ దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలోని దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రంలో కో ఆర్డినేటర్ సాయికొండలు, టెక్నికల్ కో ఆర్డినేటర్ నాగార్జున అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఇంటర్ పాసైన కూకట్‌పల్లి పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ మంగమ్మ సూచించారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 13, వంకాయ 18, బెండకాయ 41, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 35, కాకరకాయ 40, బీరకాయ 45, క్యాబేజీ 10, బీన్స్ 115, క్యారెట్ 21, గోబిపువ్వు 23, దొండకాయ 21, చిక్కుడుకాయ 55, గోరు చిక్కుడు 40, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీర 23, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 18, కంద 85, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 18, మామిడి కాయ 15-20, అరటికాయ 8-9, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 25, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 60-70, మునగకాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 85, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 30, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## ఏఈ శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం బాలాజీ నగర్ డివిజన్ ఏఈ శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్టు ఈఈ రమేశ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేపీహెచ్‌బీ డివిజన్ ఏఈఈ సాయిప్రసాద్ బదిలీపై హెచ్‌ఎండీఏకు వెళ్లారు. దీంతో ఆ బాధ్యతలను బాలాజీనగర్ ఏఈ శ్రీనివాస్‌కు అప్పగించినట్టు రమేశ్ తెలిపారు.

# కార్మికుల ఆరోగ్యం పట్టదా..!

● ఎండల్లో మ్యాన్‌హోల్ మూతలు తెరిస్తే గ్యాస్
● స్పృహతప్పి పడిపోతున్న కార్మికులు
● రక్షణ పరికరాలు ఇవ్వని అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): సీవరేజీ కార్మికుల జీవితాలు దుర్గంధంలోనే కరిగిపోతున్నాయి. మండుతున్న ఎండలకు పని చేయలేక.. అధికారుల ఒత్తిడితో మధ్యాహ్నం వేళ మ్యాన్‌హోల్స్ మూతలు తెరిస్తే గ్యాస్ రావడంతో ఊపిరాడక స్పృహ తప్పి పడిపోతున్నారు. అయినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించడం లేదు. కనీసం కార్మికులకు రక్షణ పరికరాలు అందించడం లేదు. వేసవి కాలంలో పని వేళల్లో మార్పులు చేయాలని వారు కోరుతున్నారు.

### పట్టించుకోని అధికారులు

తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్వహిస్తున్న జలమండలి అధికారులు పనిచేస్తున్న కార్మికుల గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూకట్‌పల్లి జలమండలి పరిధిలో ప్రతి సెక్షన్‌కు 8-11 మంది సివరేజీ కార్మికులు ఉన్నారు. ప్రతి సెక్షన్‌కు సూపర్ వైజర్ ఉన్నారు. ఒక జీఎం, ముగ్గురు డీజీఎంలు, 12 మంది మేనేజర్లు ఉన్నారు. జీహెచ్‌ఎంసీలో పనిచేసే కార్మికులు వేసవి కాలం దృష్ట్యా మధ్యాహ్నం వరకే విధులు నిర్వహిస్తున్నారు. జలమండలి అందుకు భిన్నం. అధికారులు ఎంత సమయం డ్యూటీలో ఉంటే కార్మికులు అప్పటివరకు పని చేయాల్సిందే. కానీ కార్మికులకు శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. కేవలం రూ. 13,500 జీతం ఇస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో విధులు నిర్వహించడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. మ్యాన్‌హోల్ మూతలు తెరిస్తే గ్యాస్ రావడంతో కార్మికులకు ఊపిరి ఆడడం లేదు. వడదెబ్బతో కొందరు కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. సమస్యకు పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

### కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపుతాం

వేసవిలో సివరేజీ కార్మికులు ఇబ్బందులను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకుంటాం. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పని చేసేలా సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తాం. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సెలవులు, ఇతరత్రా మినహాయింపులు ఉంటాయి. కార్మికుడు 8 గంటల పాటు పనిచేయాలి. ఎక్కడైనా మేనేజర్లతో ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా.

- అంబటి ప్రభాకరరావు, జనరల్ మేనేజర్, కూకట్‌పల్లి

### ప్రతీ సెక్షన్‌లో ఇద్దరు, ముగ్గురికి అనారోగ్యం

బాలాజీనగర్ సెక్షన్‌లో పనిచేస్తున్న సైదులు, వెంకన్న ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హస్మత్‌పేట్, ఎల్లమ్మబండ, కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ సెక్షన్లలో పనిచేస్తున్న కార్మికులు చాలామంది ఆస్పత్రి పాలయ్యారు. ఇలా ప్రతి సెక్షన్‌లో వారానికి ఇద్దరు, ముగ్గురు అనారోగ్య సమస్యలతో విధులకు హాజరు కావడం లేదు. ఈ రోజు విధులకు హాజరైన కార్మికుడు మరుసటి రోజు వస్తాడన్న గ్యారెంటీ లేదు. కార్మికుల కుటుంబ పరిస్థితి, పిల్లల చదువును దృష్టిలో పెట్టుకుని వారి ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎండా కాలంలో ఉదయం వేళల్లో పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



కేపీహెచ్‌బీలో మిట్ట మధ్యాహ్నం పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

# అందరూ బాగుండాలి: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దయతో రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్టు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. తన మనవడి అన్నప్రాసన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఎమ్మెల్యే యాదాద్రి నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, మనవడికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక కృషితో యాదాద్రి ఆలయ రూపురేఖలు మారాయన్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు సందీప్ రావు దంపతులు, తులసీరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కృష్ణారావు

### సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత..

కూకట్‌పల్లి నియోజకవర్గం మోతినగర్‌కు చెందిన విత్తనాల శ్రీనివాస్‌కు రూ. 2.25వేలు, మూసాపేటకు చెందిన ముదావత్ చిన్నయ్‌కు రూ.50వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కృష్ణారావు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యం బారిన పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు.



యూజీడీ పైపులైను పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే ఆరెకపూడి

హైదర్‌నగర్, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్ననగర్, మెడికల్ సొసైటీ, కుమ్మరి బస్తీల్లో రూ.35 లక్షలతో చేపట్టబోయే డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా పైపులైను పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, సమస్యల రహితంగా కాలనీలను మార్చేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం

వివేకానందనగర్ డివిజన్ వివేకానందనగర్ అపార్ట్‌మెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావ్, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌కెవి ప్రసాద్, సెక్రటరీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కామరాజు, ట్రెజరర్ బిఎస్ఎన్ మల్లేశ్వరరావు, మెంబర్లు నరేంద్రబాబు, చక్రవర్తి, ప్రసాద్ రాజు, జగన్‌మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్, పూర్ణచందర్‌రావు, శ్రీనుబాబు, స్వామి, రాధిక, సత్యవతి పాల్గొన్నారు.

# వేసవిలో పిల్లలు జాగ్రత్త

● ఉదయం పది తరువాత ఆటలు వద్దు
● తేలికపాటి ఆహారం, సరిపడా నీరు తీసుకోవాలి

కూకట్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనాలు విలవిల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం.. వేడి గాలులు వీచడంతో చిన్నపిల్లలు త్వరగా అలసిపోవడం, వడదెబ్బకు లోనవడం వంటి సమస్య తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువగా బయట ఆడుకోవడం లాంటివి చేస్తుంటారు. ఉదయం పది తర్వాత బయటకు పిల్లలను బయటకు పంపకపోవడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు తేలికపాటి ఆహారం అందిస్తూ సరిపడా నీరు తీసుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని చెబుతున్నారు.

### లేతరంగు వస్త్రాలు ధరించాలి

ఎండలో తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే టోపి లేదా గొడుగు వాడాలి. శరీరం అంతా కప్పేలా గాలి, సోకేలా తెల్లటి నూలు వస్త్రాలు ధరించాలి. లేదా లైట్ కలర్ బట్టలు వేసుకోవడం ఎంతో ఉత్తమం. సన్‌లోషన్ క్రీములు వినియోగించాలి.

- మౌనిక, పీహెచ్‌సీ వైద్యాధికారి, మూసాపేట



కూకట్‌పల్లి పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు



### వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- తప్పనిసరిగా రోజుకు రెండు నుంచి నాలుగు లీటర్ల నీటిని తాగాలి.
- సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు గ్లూకోజ్ తాగాలి.
- నీరసం. కళ్లు తిరగడం, వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున కనీసం రోజుకు రెండు సార్లయిన స్నానం చేయాలి.
- పండ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, కర్బూజ, దోసకాయల వంటివి ఎక్కువగా తీసుకోవాలి.
- కూల్‌డ్రింక్స్ అసలే తీసుకోవద్దు
- ఉదయం పది నుంచి సాయంత్రం 5 వరకు బయట తిరగకూడదు.

## 16నుంచి 25 వరకు మెట్రో బుక్ ఫెయిర్

హైదర్‌నగర్, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్‌లో ఈ నెల 16నుంచి 25వ తేదీ వరకు తెలంగాణ బుక్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైదరాబాద్ మెట్రో బుక్‌ఫెయిర్ పోస్టర్‌ను గురువారం వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, తెలంగాణ బుక్‌ట్రస్ట్ ముందుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఫెయిర్‌లో అన్ని రకాల బుక్స్ అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. పుస్తక పఠనం అవసరాన్ని గుర్తించిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అని ఎమ్మెల్యే గాంధీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, మల్లయ్య, నరేశ్, తెలంగాణ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, ప్రైవేట్ విద్యాసంస్థల రాష్ట్ర చైర్మన్ శివరాత్రి యాదగిరి, ఏఐఎఫ్‌డీవై నాయకులు వనం సుధాకర్, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ విజేతలను శాలువాతో సత్కరిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

## పవర్ లిఫ్టింగ్ విజేతలకు సన్మానం

ఫతేనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు గురువారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా విజేతలను కార్పొరేటర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించిన యుగందర్, సోను, విశాల్, మిత్రాలను యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. యువకులకు శిక్షణ నిచ్చిన కోచ్ ఆనంద్‌ను కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

● సీపీఎం మండల కార్యదర్శి శంకర్

కూకట్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని హనుమాన్‌నగర్, వెంకటేశ్వరనగర్, ఆస్‌బెస్టాస్‌కాలనీలలో సీపీఎం నాయకులు గురువారం బస్తీదవాఖానాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెరుగైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రక్తపరీక్షలు కొన్ని చోట్ల నిర్వహించడం లేదని, పేదలకు అవసరమైన మందులు కూడా అందించడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బస్తీ దవాఖానాలలో సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, కృష్ణారావు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కల్యాణం

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శైలజ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీహర్షశ్రావ్య, ప్రణీత్‌శ్రావ్య దంపతులు కల్యాణంలో కూర్చున్నారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు విజయ్‌కుమార్ చౌదరి, రామస్వామి, కేవీఎస్ రామారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.




సమ్మెపోస్టరును ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

## ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె

బాలానగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజేశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బాలానగర్‌లో సీఐటీయూ నాయకులు గురువారం వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుమార్, గణేశ్, సత్యనారాయణరెడ్డి, బాబురావు, రహీమ్, వినేష్‌గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.



నోటీసులు సిద్ధం చేస్తున్న డా.కవిత

## విధులకు రాని పారిశుధ్య సిబ్బందికి నోటీసులు

కుత్బుల్లాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య సిబ్బంది కొందరు సరిగా విధులకు హాజరు కావడం లేదని అధికారులు గుర్తించారు. వారు విధులకు వస్తారా, లేదా? అనేది తెలియకపోవడంతో ఉన్న కార్మికులతోనే పనులను చక్కబెడుతున్నారు. నెలల తరబడి విధులకు రాకపోవడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు ఏఎంహెచ్ఓ డా.కవిత గురువారం 85 మందికి నోటీసులు జారీ చేశారు. పనులకు రాకపోవడానికి గల కారణాలను తెలుపాలని, ఆరోగ్య సమస్యలుంటే తెలియజేయాలని సూచించారు. తమ నోటీసుకు స్పం దించని వారి వివరాలను ఉన్నతాధికారులకు అందజేసి వారి సూచన మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



బీఆర్ఎస్ నేత భాస్కర్‌ను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

షాపూర్‌నగర్, మే (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం డివిజన్ పరిధిలోని న్యూశివాలయనగర్‌లో వెలసిన జగద్గురు విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ ముఖ్యఅతిథిగా హా జరై స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు లింగం, దొడ్ల కృష్ణ, డేవిడ్ స్థానికులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

## పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

గాజులరామారం, మే 8 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలను గురువారం అందజేశారు. కృష్ణవేణికి రూ.5 వేలు, పుష్పమ్మ రూ.60 వేలు, రేణుకాకు రూ. 60 వేలు, వీరప్పకు రూ. 60లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందిస్తోందన్నారు. అర్హులైన పేదలు ఈ పథకానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

## రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

పేట్‌బషీరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): రహదారులకు ఇరువైపులా వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తుండటంతో ఆ మార్గంలో వెళ్లే ఇతర వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రంగారెడ్డినగర్ డివిజన్ ప్రధాన రహదారి నుంచి పారిశ్రామికవాడకు వెళ్లే దారికి ఇరువైపులా ట్రాక్టర్లు, డీసీఎంలు, ద్విచక్ర వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ దారిలో వెళ్లే ప్రయాణికులకు, కార్మికులకు అవస్థలు తప్పడం లేదు. రహదారిపై వాహనాలను పార్కింగ్ చేయకుండా సంబంధిత విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, కార్మికులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు

## మురుగు నుంచి మోక్షం లేదాయె!

● దుర్వాసనతో ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

గాజులరామారం, మే8 (ఆంధ్రజ్యోతి): రెండు వారాలుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తున్నా అధికారులు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గాజులరామారం డివిజన్‌లోని వీఎస్ఆర్ అపార్టుమెంట్ ముందు డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచి ఉంది. మ్యాన్‌హోల్ పొంగినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు రోడ్డును వేసేటప్పుడు ప్రణాళికాబద్ధంగా నిర్మించక పోవడం వల్ల రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉందని, వర్షం వస్తే నీరు రోడ్డుపై నిలిచిపోయి వాహనాల రాక పోకలకు ఇబ్బంది కలుగుతోందని పలువురు పేర్కొన్నారు.

# అధికారుల అలసత్వం.. ప్రజలకు ప్రాణసంకటం!

- రోడ్డును విస్తరించి 'కటింగ్'ను విస్మరించిన వైనం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు కటింగ్‌లతో గుంతగా మారిన ప్రధాన రహదారి

షాపూర్‌నగర్, మే (ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వం. కాంట్రాకర్ల నిర్లక్ష్యం.. వెరసి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రోడ్డు కటింగ్‌లను అలాగే వదిలేశాడు. మూడు వైపులా రోడ్డువేసి మధ్యలో కొంతభాగం వదిలేయడంతో గుంతగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- షాపూర్‌నగర్ గాజులరామారం చౌరస్తాలో ఉన్న ఇందిరాగాంధీ, రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలను తొలగించి పక్కనే ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి ముందు ప్రతిష్ఠించారు. తర్వాత బాలానగర్, నర్సాపూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా రోడ్డు పక్కన ఉషోదయ టవర్స్ ముందు మూడువైపులా రోడ్డు భూమికి అరడుగు ఎత్తులో ఉండటం, రోడ్డు కటింగ్‌లను అలానే వదిలేయడంతో ఆ ప్రాంతంలో గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది.
- ఇన్నపాటి వర్షం వచ్చినా ఆ గుంతలో నీరు చేరి చిన్న కుంటలా మారుతోంది. ఈరోడ్డు చౌరస్తాలో నిత్యం వాహనాలతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. పగలే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొత్తవారు రాత్రివేళ ఈ రోడ్డుపైకి వస్తే ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెప్తున్నారు.
- తక్షణమే ఈరోడ్డు కటింగ్‌లో మట్టి పోసి లేదా.. మాల్ పోసి మరమ్మతులు చేయాలని పలువురు జీహెచ్ఎంసీ అధికారులను, ఆర్అండ్‌బీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



వాజ్‌పాయినగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

## రోడ్డును తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్

- రాకపోకలకు స్థానికుల అవస్థలు

కుత్బుల్లాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ వాజ్‌పేయినగర్‌లో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారుల స్థానంలో కొత్తగా సీసీ రోడ్లు వేయించేందుకు శ్రీకారం చుట్టారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ వారం రోజుల క్రితం ఉన్న రోడ్డును తవ్వించి వదిలేశాడు. పాత రోడ్డైనా బాగుండేదని... రోడ్డు వేస్తామని తవ్వించి పత్తాలేకుండా పోయాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ తమకు వీలైనప్పుడు పనులు చేస్తామనే ధోరణిలో ఉన్నాడని, సంబంధిత అధికారులు నిద్రమత్తులో ఉండటంతోనే పనులు సమయానికి జరగడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# గోతులు పడి.. కంకర తేలి..

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- రాకపోకలకు మహాదేవపురం, కైలాస్ హిల్స్ కాలనీ ప్రజల అగచాట్లు



రోడ్డుపై తేలిన కంకర

గాజులరామారం, మే 8 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారు కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ రోడ్ల దుస్థితిని అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురం, కైలాస్ హిల్స్ కాలనీల్లో ఏ రోడ్డు చూసినా అడుగు లోతు గుంత పడి, కంకర తేలి కనిపిస్తున్నాయి. సుమారు 2 వేల కుటుంబాలు ఈ కాలనీల్లో నివసిస్తున్నాయి. ప్రతీ సంవత్సరం పన్నుల రూపంలో తమ కాలనీల నుంచి లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నా కనీస సదుపాయాలైన రోడ్లు , డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిదులు విఫలమవుతున్నారని మహాదేవపురం, కైలాస్‌హిల్స్ కాలనీ వాసులు వాపోతున్నారు.

● తమ కాలనీల్లో కొత్త రోడ్లను వేయాలని అధికారులు, నాయకులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధ్వానంగా ఉన్న తమ కాలనీ రోడ్లపై ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తమ కాలనీల్లోని రోడ్లను బాగు చేయించాలని మహాదేవపురం, కైలాస్ హిల్స్ కాలనీవాసులు కోరుతున్నారు.



మహాదేవపురం కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి ఇదీ..

### పన్నులు చెల్లిస్తున్నా రోడ్లు వేయడం లేదు



కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతోంది. జీహెచ్ఎంసీకి అన్ని రకాల పన్నులను చెల్లించినా రోడ్డు మాత్రం వేయడం లేదు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఏర్పాటు చేసిన కాలనీల్లో రోడ్డులను వేస్తున్న అధికారులు మా కాలనీలో మాత్రం వేసేందుకు అలసత్వం వహిస్తున్నారు.

-దుగ్యాల ప్రసాద్, మహాదేవపురం



సుచిత్ర చౌరస్తాలో చెరిగిపోయిన జీబ్రా క్రాసింగ్స్

## 'సుచిత్ర'లో కానరాని 'జీబ్రా క్రాసింగ్స్'

- రోడ్డు దాటేందుకు పాదచారుల ఇక్కట్లు

పేట్‌బషీరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): సుచిత్ర చౌరస్తాలో జీబ్రా కాసింగ్స్ కనిపించడం లేదు. దీంతో రోడ్డు దాటేందుకు పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు .. పాదచారులు రోడ్డు క్రాస్ చేసేటపుడు జీబ్రా క్రాసింగ్ లైన్లపైనే నడవాలని, రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై నడవాలని చెప్తుంటారు. అయితే, పోలీసులు మాత్రం ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారులు చేస్తున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడంలోను, చౌరస్తాలో చెరిగిపోయిన జీబ్రా క్రాసింగ్స్ మళ్లీ వేయించడంలో మాత్రం విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే సుచిత్ర చౌరస్తాలో జీబ్రా లైన్స్ లేకపోవడంతో రోడ్డు దాటే సమయంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు సుచిత్ర చౌరస్తాతో పాటు అవసరమైన చోట వెంటనే జీబ్రా క్రాసింగ్స్‌ను వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## సూరారం పీఎస్ పరిధిలో ఇద్దరి అదృశ్యం



అమీనుద్దీన్



సయ్యద్ వలీ

గాజులరామారం మే 8 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన వృద్ధుడు, తండ్రితో కలిసి మొబైల్ షాప్‌నకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.. పోలీసుల కథనం ప్రకారం.. గాజులరామారానికి చెందిన అమీనుద్దీన్ (14) ఈనెల 6వ తేదీన దేవేందర్‌నగర్‌లోని మొబైల్ షాప్‌నకు తండ్రి నసీరుద్దీన్‌తో కలిసి వెళ్లాడు. అయితే వాష్‌రూమ్‌కు వెళ్తున్నానని అమీనుద్దీన్ తండ్రికి చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

● సూరారంలోని వైష్ణవి కాలనీకి చెందిన సయ్యద్ వలీ (65) కొంతకాలంగా కూతురు దగ్గర ఉంటున్నాడు. ఈనెల 7న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం బంధు,మిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సూరారం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కాగా, రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శైలజ దంపతులు పూజలు నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేపీహెచ్‌బీకాలనీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.అలివేలు మంగమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించినవారు తెలంగాణ దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలోని దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రంలో కో ఆర్డినేటర్ సాయికొండలు, టెక్నికల్ కో ఆర్డినేటర్ నాగార్జున అందుబాటులో ఉంటారని చెప్పారు.



శంభీపూర్ కృష్ణతో సమావేశమైన పలు బస్తీల ప్రజలు

## 'ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం'

దుండిగల్, మే 8(ఆంధ్రజ్యోతి):నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు బస్తీ లు, కాలనీల ప్రజలు ఆయనను శంభీపూర్‌లో కలిసి తమ బస్తీలోని సమస్యలను వివరించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ల దృష్టికి ఆయా సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని శంభీపూర్ కృష్ణ వారికి హామీ ఇచ్చారు.

## పార్కింగ్ గొడవ.. కర్రలు, రాడ్లతో దాడి

● ఐదుగురికి రిమాండ్




నిందితులను చూపిస్తున్న పోలీసులు

నిజాంపేట్,మే8(ఆంధ్రజ్యోతి): బైక్ పార్కింగ్ విషయంలో తలెత్తిన స్వల్ప వివాదం నేపథ్యంలో కొందరిపై రాడ్లు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేసిన ఐదుగురిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్-1లో నివాసం ఉంటున్న గుడిపల్లి సంతోష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే బ్లాక్‌లో రెండేళ్లుగా బీహార్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ధీరజ్ ఇంటికి వచ్చే బంధువులు తమ వాహనాలను సంతోష్‌కు కేటాయించిన పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసేవారు. ఈ క్రమంలో సంతోష్ తన బైక్‌ను పార్కు చేయడానికి స్థలంలేక ఇబ్బంది పడేవాడు. వేరే చోట మీ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని వారికి సూచించేవాడు. ఇలా ఉండగా, ఈనెల 6వ తేదీ రాత్రి పార్కింగ్ విషయంలో వివాదం జరగడంతో సంతోష్‌ను ధీరజ్‌కుమార్ విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో అతడి చెయ్యి విరిగింది. అంతేకాక సమీపంలోనే ఉండే ధీరజ్ బంధువులు రోహన్‌కుమార్, రామ్‌రతన్‌సింగ్, సంతోష్‌సింగ్, రోహిత్‌సింగ్ కర్రలు, రాడ్లతో పలువురిపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు దాడికి పాల్పడ్డ ఐదుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చెత్త తరలింపులో నిర్లక్ష్యం

- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసన, దోమల బెడదతో స్థానికుల ఇక్కట్లు

పేట్‌బషీరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి):రంగారెడ్డినగర్ డివిజన్‌లోని రహదారులు చెత్తకు కేరాఫ్‌గా మారాయి. చెత్త తరలింపులో ఇలా పారిశుధ్య అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్ల వెంబడి ఎక్కడికక్కడ చెత్త కుప్పలుగా పేరుకుపోతున్నాయి. చెత్త నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని, దోమలు పెరిగిపోతున్నాయని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గుబురుగుట్ట, రంగారెడ్డినగర్ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. చెత్త నుంచి దుర్వాస వస్తుండటంతో ఈ ప్రాంతంలో ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని కార్మికులు, పాదచారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇలా అధికారులు స్పందించి ఇక్కడి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



గుబురుగుట్టకు వెళ్లే చౌరస్తాలో పేరుకుపోయిన చెత్త



వివేకానందస్వామి విగ్రహం నుంచి రంగారెడ్డినగర్‌కు వెళ్లే దారిలో..

## చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



పేట్‌బషీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న దూలపల్లి నుంచి మైసమ్మగూడకు వెళ్లే మార్గంలో చర్మాస్ షోరూమ్ సమీపంలో 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా, స్థానికులు గమనించి 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు ఆ వృద్ధుడిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎరుపు, నలుపు గీతల చొక్కా, యాష్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, అతడిని ఎవరైనా గుర్తుపడితే పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## ఆగిపోయిన పనులను ప్రారంభించండి

### జోనల్ కమిషనర్‌ను కోరిన కార్పొరేటర్



జోనల్ కమిషనర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి, మే 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి ప్రాంతంలోని పలు కాలనీల్లో అభివృద్ధి పనులు మధ్యలో ఆగిపోయాయని వాటిని తిరిగి ప్రారంభించేలా చూడాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖాడేకు విజ్ఞప్తిచేశారు. గురువారం ఆయన జోనల్ కమిషనర్‌ను కలిసి డివిజన్ పరిధిలో చేయాల్సిన పలు అభివృద్ధి పనులు, గతంలో ప్రారంభమై మధ్యలో ఆగిపోయిన పనులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మధ్యలో నిలిచిపోయిన పనుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువుల సుందరీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయని, పార్కుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, రోడ్ల మరమ్మతులు చేయాల్సి ఉందని వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొత్తగా బదిలీపై వచ్చిన సందర్భంగా జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు మొక్కను బహూకరించి శాలువతో సత్కరించారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

మియాపూర్, మే8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... ఆర్‌సీపురం అశోక్‌నగర్‌లో నివాసం ఉండే బి.గోపిప్రియ(29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. గురువారం ఉదయం తన స్కూటీపై మియాపూర్ నుండి చందానగర్ వైపు వెళ్తుండగా మదీనగూడ అర్చన హాస్పిటల్ ఎదురుగా ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ బైకర్ ఆకస్మాతుగా కుడి వైపు తిరగడంతో వెనుకాల వస్తున్న గోపిప్రియ స్కూటీకి బైక్ తగలడంతో కింద పడిపోయింది. ఇదే సమయంలో వెనుకాల వచ్చిన ఆర్టీసీ బస్సు గోపిప్రియ పై నుండి వెళ్లింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను జీహెచ్ఎంసీ కార్మికులు, వాహనదారులు హాస్పటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. కుమార్తె మృతికి కారణమైన బస్సు డ్రైవర్, బైకర్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కల్వర్ట్‌పై రోడ్డు గుంతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

## కల్వర్ట్‌పై గుంతలకు మరమ్మతులు చేయాలి

హైదర్‌నగర్, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఆల్విన్‌కాలనీ ఉషా ముళ్లపూడి రోడ్డు ప్రధాన రహదారిలో తులసీవనం వద్ద ఉన్న కల్వర్ట్‌పై గుంతలను పరిశీలించారు. వెంటనే సిబ్బందిని పిలిపించి ప్యాచ్‌వర్క్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, వీలైనంత త్వరగా గుంతలను పూడ్చి వాహన దారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అదేవిధంగా బ్రిడ్జిపై వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, కాలనీవాసులు

## నాలా నిర్మాణ పనుల పరిశీలన

చందానగర్, మే8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం లోపు బాక్స్ నాలా నిర్మాణ పనులను పూర్తిచేయాలని మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ హుడాకాలనీ విద్యావాణి పాఠశాల ముందు నుంచి నిర్మిస్తున్న బాక్స్ నాలా నిర్మాణ పనులను జలమండలి, ఇంజనీరింగ్ అధికారులు.. స్థానికులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ వాసుదేవరావు, అధ్యాపకులు

## 'పది' ఫలితాల్లో విజయ భారతి విద్యార్థుల ప్రభంజనం

మియాపూర్, మే8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో శ్రీ విజయ భారతి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. 600 మార్కులకు గాను బి.శ్రీదేవి 545, మహిభరత్ 531, అమృత 528, జహేర పాతిమ 526, విజయ్‌కుమార్ 523 మార్కులు సాధించినట్లు వాసుదేవరావు తెలిపారు. 500కు పైగా మార్కులు 10మంది, 400కుపైగా మార్కులు 9మంది సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులతో కలిసి ఆయన విద్యార్థులను అభినందించారు.



శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు పత్రాలు అందజేస్తున్న రామకృష్ణ

## జనశిక్షణ సంస్థాన్ సేవలు అభినందనీయం

### కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ

గచ్చిబౌలి, మే 8 (ఆంధ్రజ్యోతి): జనశిక్షణ సంస్థాన్ అందిస్తున్న సేవలు అమోఘమని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ అన్నారు. బెటాలియన్‌లోని మహిళలకు ఆరునెలలుగా వివిధ అంశాల్లో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు గురువారం ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ, శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసుకొని తమ కాళ్లపై తాము నిలబడే విధంగా వారిని తయారు చేయడం అభినందనీయమన్నారు. మగ్గం పనులు, కుట్లు, అల్లికలు, రోలింగ్ వంటి అంశాల్లో సుమారు 3 నుంచి 6 నెలల వరకు శిక్షణ ఇవ్వడం వలన వారు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు కమాండెంట్ సతీమణి సంధ్యారాణి, సంస్థాన్ డైరెక్టర్ శ్రీరామ్ మోహన్ పాల్గొన్నారు.

# మట్టిరోడ్లే దిక్కు..!

### ఐటీ జోన్‌కు ఆనుకుని ఉన్నా.. మౌలిక వసతులకు దూరం

### ప్రభుత్వ ఉద్యోగులు నివసించే టీఎన్‌జీఓ కాలనీ దుస్థితి



టీఎన్‌జీకాలనీలో అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న మట్టి రోడ్లు

రాయదుర్గం, మే8 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలకు కేంద్రంగా ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన నానక్‌రామ్‌గూడ ఐటీ జోన్ ప్రాంతానికి ఆనుకుని ఉన్నప్పటికి రంగారెడ్డి జిల్లా.. టీఎన్‌జీఓ కాలనీలో కనీస మౌలిక వసతులకు దూరంగా ఉంది. ఇది ప్రభుత్వ ఉద్యోగుల కాలనీ అయినాకానీ కనీసం రోడ్లు వేయించుకోలేని పరిస్థితి. కాలనీ ఏర్పడి 30 సంత్సరాలయినా ఎక్కడ చూసినా మట్టి రోడ్లే. టీఎన్‌జీఓ కాలనీ రోడ్లు. రాష్ట్రంలో మారుమూల కుగ్రామాల్లో సైతం ఎక్కడ చూసినా సీసీ రోడ్లు కనిపిస్తున్నా.. ఈ కాలనీలో మాత్రం మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఐటీ కంపెనీలు వెలియడంతో అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. ఈ ప్రాంతానికి దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ఐటీ ఉద్యోగులు వచ్చి నివాసం ఉండటంతో అనేక భవన నిర్మాణాలు వెలిశాయి.



### జీహెచ్ఎంసీకి పెరిగిన ఆదాయం

కాలనీలో నిర్మాణాలు పెరగటంతో జీహెచ్ఎంసీ ఖాజానాకు ఆదాయం పెరిగింది. ఈ కాలనీకి రిజిస్ట్రేషన్లు చేసే వీలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ లేని ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టడం వలన 100 శాతం పెనాల్టీతో జీహెచ్ఎంసీ ట్యాక్సు వసూళ్లు చేస్తోంది. పెనాల్టీతో చెల్లించినా గాని అధికారులు రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో సుమారు 500 ప్లాట్లు ఉన్నాయని అందులో 100 ప్లాట్ల యజమానులు 100 శాతం పెనాల్టీతో ట్యాక్సు చెల్లిస్తున్నారు. మరో 50 మంది ప్లాట్ల యజమానులు ట్యాక్సు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటి వరకు రెగ్యులర్‌గా 400 మంది ప్లాట్ల యజమానులు ఏటా మొత్తం రూ. 2.50 కోట్ల ట్యాక్సు చెల్లిస్తున్నారు.

### అనేక సార్లు వినతి పత్రాలు

రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓ కాలనీలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు జీహెచ్ఎంసీ అధికారులకు అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చారు. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఈ మధ్య కాలంలో కాలనీ వాసుల ఒత్తిడి ఎక్కువ కావడంతో కొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇంకా 90 శాతం రోడ్లు నిర్మించాల్సి ఉంది.

### 29 రోడ్ల నిర్మాణం చేపట్టాలి

రెండు దశాబ్దాలనుంచి కాలనీలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని జీహెచ్ఎంసీని కోరుతున్నాం. అయితే అధికారులు అనేక మార్లు బడ్జెట్ పేరుతో పనులు చేపట్టడం లేదు. ఈ మధ్యకాలంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించి కొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టారు. కాలనీలో సుమారు 29 రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరాం.

*- గడ్డం జంగయ్య, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు*

### త్వరలో రోడ్ల నిర్మాణం చేపడుతాం

బడ్జెట్‌లో వెసులుబాటు కాకపోవడం వలన టీఎన్‌జీఓ కాలనీలో రోడ్ల నిర్మాణం ఆలస్యం అయింది. ఈ ఆరు నెలల కాలంలో కొన్ని రోడ్లు నిర్మించాం. త్వరలో కాలనీలోని అన్ని రోడ్ల నిర్మాణం చేపడుతాం

*- దుర్గా ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20*



యూజీడీ పైపులైను పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే ఆరెకపూడి

హైదర్‌నగర్, మే8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్ననగర్, మెడికల్ సొసైటీ, కుమ్మరి బస్తీల్లో రూ.35 లక్షలతో చేపట్టబోయే డ్రైనేజీ పైపులైను నిర్మాణ పనులకు కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా పైపులైను పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, సమస్యల రహితంగా కాలనీలను మార్చేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం

వివేకానందనగర్ డివిజన్ వివేకానందనగర్ అపార్ట్‌మెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావ్, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌కెవి ప్రసాద్, సెక్రటరీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కామరాజు, ట్రెజరర్ బిఎస్ఎన్ మల్లేశ్వరరావు, మెంబర్లు నరేంద్రబాబు, చక్రవర్తి, ప్రసాద్ రాజు, జగన్‌మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్, పూర్ణచందర్‌రావు, శ్రీనుబాబు, స్వామి, రాధిక, సత్యవతి పాల్గొన్నారు.

## యుద్ధంలో గెలవాలని దేవుడిని ప్రార్థించండి: గరికపాటి

మియాపూర్, మే8 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులపై భారత్ చేస్తున్న యుద్ధంలో గుడికి వెళ్లే ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో భగవంతుడిని పూజించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, అవధాని గరికపాటి నరసింహరావు అన్నారు. దేశం చేస్తున్న ధర్మ యుద్ధంలో మనకోసం మొక్కులకంటే.. దేశం గెలవాలని, ఉగ్రవాదం అంతం కావాలని ప్రజలు దేవుడిని కోరుకోవాలన్నారు. గురువారం మియాపూర్ దీప్తిశ్రీనగర్ ధర్మపురిక్షేత్రంలో త్రిమూర్తుల కల్యాణోత్సవానికి ఆయన తన సతీమణి శారదాంబతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మపురిక్షేత్ర ట్రస్టీ గొట్టిపాటి సత్యవాణి విజయదుర్గాదేవి అమ్మవారికి అందజేసిన స్వర్ణలేపిత రజత వస్త్రాన్ని శారదాంబ చేతుల మీదుగా అమ్మవారికి అందజేశారు. కల్యాణ మహోత్సవంలో గరికపాటి దంపతులు పాల్గొని భక్తులకు సందేశాన్ని అందించారు.



స్వర్ణలేపిత రజత వస్త్రాన్ని శారదాంబ చేతుల మీదుగా అమ్మవారికి అందజేస్తున్న నరసింహరావు, గొట్టిపాటి సత్యవాణి



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ప్రజల్లో చైతన్యం నింపడానికి, ఆధ్యాత్మిక గురువులు కృషిచేస్తున్నారని దేశం పాకిస్థాన్‌పై చేసే యుద్ధంలో భౌతికంగా సైనికుల పాత్ర కీలకమైనా గురువుల శక్తి ఆ యుద్ధం గెలవడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం త్రిమూర్తుల కల్యాణం వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అట్లూరి సుబ్బారావు దంపతులతో పాటు పలువురు కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ విజేతలకు సత్కారం

ఫతేనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు గురువారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా విజేతలను కార్పొరేటర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రతిభకు పేదరికం అడ్డు రాదని నిరూపించిన యుగంధర్, సోను, విశాల్, మిత్రాలను యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ సూచించారు. యువకులకు శిక్షణ నిచ్చిన కోచ్ ఆనంద్‌ను కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు.



పవర్ లిఫ్టింగ్ విజేతలను శాలువాతో సత్కరిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

# రోడ్డు దాటాలంటే దడ

### భెల్ పై వంతెనతో కొత్త ఇక్కట్లు



రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు



బీహెచ్ఈఎల్ వద్ద కొత్తగా ప్రారంభమైన పైవంతెన

చందానగర్, మే8 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ పైవంతెన కొత్త తంటాను తెచ్చిపెట్టింది. జాతీయ రహదారిపై వాహనాల వేగం పెరిగింది. ఈ పైవంతెన అందుబాటులోకి వచ్చాక వాహనాలు దూసుకుపోతున్నాయి. రోడ్డు దాటే చోటు, చందానగర్ బస్టాండ్ రెండూ ఒకే చోటు ఉండడంతో పాటు, ఇక్కడ సిగ్నల్లు లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. రోడ్డు దాటే సమయంలో బాటసారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ వాహనాలు నిదానంగా వెళ్లే అస్కారం లేదు. గతంలో వాహనాల వేగ నియంత్రణ కోసం జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జీబ్రా క్రాసింగ్‌లు కనిపించకపోవడంతో బాటసారులు రోడ్డు దాటాలంటేనే ఆందోళన చెందుతున్నారు. చందానగర్‌లోని జాతీయ రహదారి (65)కు ఇరువైపుల బహుళ అంతస్తుల వ్యాపార సముదాయాలు అధికంగానే ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వ్యాపార, విద్య, ఉపాధి రంగాల్లో పనిచేయడానికి నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ ప్రమాదాలు సంభవించే అస్కారం ఎక్కువగా ఉంది.

గతంలో చందానగర్ బస్టాప్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం నిదులు మంజూరుకావడంతో రెండేళ్ల క్రితమే పునాదులు తీశారు. పైవంతెన నిర్మాణంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బ్రిడ్జిని నిర్మించి రోడ్డు దాటే సమయంలో ఏర్పడే ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## 16నుంచి 25 వరకు మెట్రో బుక్ ఫెయిర్

హైదర్‌నగర్, మే8 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లో ఈనెల 16నుంచి 25వ తేదీ వరకు తెలంగాణ బుక్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైదరాబాద్ మెట్రో బుక్‌ఫెయిర్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, సమాజంలో పుస్తకాల పట్ల అవగాహన పెంచాలని, ప్రస్తుతం సెల్ ఫోన్‌లతో లీనమైపోతున్న సంస్కృతికి ప్రజలు అలవాటు పడ్డారన్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణ బుక్‌ట్రస్ట్ ముందుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఫెయిర్‌లో అన్ని రకాల బుక్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం అవసరాన్ని గుర్తించిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1956లోనే నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, మల్లయ్య, నరేష్, తెలంగాణబుక్ ట్రస్ట్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, ప్రైవేట్ విద్యాసంస్థ రాష్ట్ర చైర్మన్ శివరాత్రి యాదగిరి, ఏఐఎఫ్‌డీవై నాయకులు వనం సుధాకర్, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో దోస్తు అడ్మిషన్లు ప్రారంభం

చందానగర్, మే8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు-2025-26 అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కవిత అన్నారు. కళాశాలలో బీఏ, 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో-60, బీఎస్సీ ఫిజికల్ సైన్స్-60, బీఎస్సీ లైఫ్ సైన్స్-60 సీట్లు, ఇంగ్లిష్ మీడియంలో కూడా అవకాశం ఉందన్నారు. మీ-సేవ కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.



పుష్కరిణి శ్రీచక్ర అర్చనలో భక్తులు

## ఘనంగా ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు

చందానగర్, మే8 (ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వారం రోజులనుంచి అంగరంగ వైభవోపేతంగా జరిగిన 57వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలు, పుష్కరిణిలో శ్రీచక్ర అర్చన భక్తిశ్రద్ధలతో చేశారు. యాగశాలలో నిత్యహోమంతోపాటు ఆగమన శాస్త్రయుక్తంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతితో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి పూజలు

చందానగర్, మే8 (ఆంధ్రజ్యోతి): జగద్రక్షక శ్రీధర్మ శాస్త అయ్యప్పస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ, అష్టద్రవ్య అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



నల్లగండ్లలో ఆయుర్వేద ఆసుపత్రిని ప్రారంభిస్తున్న అజయ్ మిశ్రా

## ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్యం

### విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా

గచ్చిబౌలి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందుల ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ విశ్రా అన్నారు. గురువారం ఆయన శేరిలింగంపల్లి నల్లగండ్లలో ఇందు ఆయుర్వేద క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మన సంప్రదాయ వైద్యం ఆయుర్వేదమని, ఈ మందులవల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. మన ప్రాచీనవైద్య చికిత్సలో ఆయుర్వేద వైద్యం ఎంతో ప్రసిద్ధిగాంచింది అన్నారు. లింగంపల్లి ప్రాంత ప్రజలకు ఈ ఆయుర్వేద క్లినిక్ మంచిసేవలు అందించాలని ఆయన నిర్వాహకులను కోరారు. నేటి నుంచి నల్లగండ్ల ప్రాంత ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు అందుబాటులోకి రావడం చాలా శుభపరిమాణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తాను 35 సంవత్సరాలుగా ఆయుర్వేద చికిత్స విధానాలను అనుసరిస్తున్నానని, ఎలాంటి సమస్యలు తలెత్తలేదని తెలిపారు. కార్యక్రమంలో క్లినిక్ నిర్వాహకులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.